# నేటి ప్రస్థానం

తెలుగు దిన పత్రిక

APTEL/2013/54506



## రిపోర్టర్స్ కావలెను

నిజాలు నిర్భయంగా రాసే సత్తా ఉండి.. ఎలాంటి భయం.. పక్షపాతం అన్నది లేకుండా ఉన్నది ఉన్నట్లు రాయగలిగే రిపోర్టర్లు కావలెను. మీలో ఈ సత్తా ఉంటే కింది నెంబర్లకు రెజ్యుమో పంపండి.

95150 34555
84979 20544



ఎడిటర్: ఐతగోని రాఘవేంద్ర | శుక్రవారం, 11 ఏప్రిల్ 2025 | సంపుటి: 12 | సంచిక: 29 | పేజీలు: 4 | వెల:10/-







# సైబర్ వల చిక్కితే విలవిల

- ఏటా పెరిగిపోతున్న సైబర్ మోసాలు
- అప్రమత్తమయ్యేలోపే కొత్త ఎత్తులు
- సైబర్ కేటుగాళ్ల వలలో విద్యావంతులు
- భయం, దురాశ కారణంగానే మోసాలు
- హనీట్రాప్ బారినపడుతున్న మరికొందరు
- ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం శూన్యం
- మోసపోయిన తొలి గంటలోనే 1930కి కాల్ చేస్తే సైబర్ క్రిమినల్స్‌కు చెక్
- అప్రమత్తతతోనే నేరాలకు ఫుల్‌స్టాప్



ఆన్‌లైన్, సాంకేతికతను ఆధారంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు పెట్రేగిపోతున్నారు. అమాయకులు, మహిళలు, టెక్నాలజీపై అవగాహన లేని వారిని, డబ్బు అత్యవసరం ఉన్న వారిని టార్గెట్‌గా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. కేవలం నిరక్ష్యరాస్యులే కాదు విద్యావంతులు సైతం ఈ మోసాలకు బలవుతున్నారు. ఇటీవల ఈ సైబర్ మోసాల బారినపడ్డ చాలామంది పోలీస్‌స్టేషన్లలో కేసులు కూడా నమోదు చేశారు. అపరిచిత కాల్స్‌కు స్పందించినా, లింక్స్ క్లిక్ చేసినా మనం వారి ఉచ్చులో పడ్డట్టే. సైబర్ మోసాలు రకరకాలుగా జరుగుతున్నాయి. వయస్సు, వ్యక్తుల విధులను బట్టి కూడా నేరాలు జరుగుతున్నాయి.

మిగతా 2 లో



## 24 నుంచి బడులకు వేసవి సెలవులు

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండలు మండిపోతుండటంతో విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 24 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్లకు సెలవులు ప్రకటించింది. వేసవి సెలవులపై రకరకాల ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన విడుదల చేసింది. ఏప్రిల్ 24న సెలవులు ప్రారంభం కానుండగా, తిరిగి జూన్ 12న పునఃప్రారంభమవుతాయి. వేసవి సెలవుల్లో భాగంగా మొత్తం 45 రోజులకుపైగా పాఠశాలలు మూతపడనున్నాయి.

## జీతం కోసం టీచర్ ధర్నా




04

# పెండింగ్ బిల్లులు చెల్లించండి



### మాజీ సర్పంచ్‌ల సంఘం డిమాండ్

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్‌లు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లే కార్డులతో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు రాక సర్పంచ్‌లు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ రోజు, రేపు అంటూ బిల్లుల విడుదలలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు విడుదల చేయకపోగా రేవంత్ ప్రభుత్వం మాజీ సర్పంచ్‌లపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని దుయ్యబట్టారు. పెండింగ్ బిల్లుల కోసం సీఎంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసినా ఫలితం కానరావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను విడుదల చేసేంత వరకు ప్రతీ రోజు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లయ్య, కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

# మేం రిపోర్టర్లం.. టోల్ కట్టం!

- టోల్ ఫీజు అడిగినందుకు సిబ్బందిపై దౌర్జన్యం
- శంషాబాద్ తొండుపల్లి టోల్‌గేట్ వద్ద ఘటన



**నేటి ప్రస్థానం, రంగారెడ్డి:** 'మేం మీడియా వాళ్లం.. మమ్మల్నే డబ్బులు అడుగుతావా' అని దుర్భాషలాడుతూ కొందరు టోల్ సిబ్బందిపై దాడికి దిగారు. శంషాబాద్ పరిధి తొండుపల్లి టోల్‌గేట్ వద్ద ఈ ఘటన జరిగింది. శంషాబాద్ సీఐ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఔటర్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను టోల్ కట్టాలని సిబ్బంది అడగ్గా.. 'మేం మీడియా వాళ్లం.. మమ్మల్నే డబ్బులు అడుగుతావా' అంటూ దాడికి పాల్పడ్డారు. కారులోంచి దిగిన ఓ వ్యక్తి ఏకంగా టోల్‌బూత్‌లోకి వెళ్లి నానా హంగామా సృష్టించాడు. అంతటితో ఆగకుండా ఫీజు అడిగిన సంజయ్‌దత్ కాలర్ పట్టుకొని బయటకు లాగాడు. ఇంతలోనే మరో ఇద్దరు దాడికి దిగిన వ్యక్తికి మద్దతుగా టోల్‌సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను రాజేంద్రనగర్ పరిధి కిస్మత్‌పూర్‌కు చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం.

## వక్ఫ్ చట్టంతో ముస్లిం సంక్షేమానికి సోపానం

02



# తెలంగాణ సాధించిన వీరుడు కేసీఆర్

## నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

## బీఆర్‌ఎస్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**నేటి ప్రస్థానం, నల్లగొండ:** 2001లో కేసీఆర్ ఒక్కడుగా వచ్చి తెలంగాణ రాష్ట్రం కోసం లక్షల సైన్యాన్ని కదిలించి.. 14 ఏండ్లు పోరు చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వీరుడని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నేతలతో కలిసి వరంగల్‌లో ఈ నెల 27న తలపెట్టిన బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరంగల్ సభకు అన్ని గ్రామాలు, వార్డుల నుంచి బీఆరెస్ కుటుంబ సభ్యులు, అభిమానులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 13న లక్ష్మీగార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. 10 ఏండ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిస్తే.. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని అథోగతి పాలు చేసిందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేటికీ ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ తప్పులను రజతోత్సవ సభలో ఎండగడుతామని స్పష్టం చేశారు.

# హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు గ్రీన్ సిగ్నల్




**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** ఏపీ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై కేంద్రం ఫోకస్ చేసింది. ఇందులో భాగంగా అమరావతి, హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వెంటనే డీపీఆర్ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఫిబ్రవరి 3న కేంద్రహోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ 15 శాఖల అధికారులతో సుదీర్ఘ సమావేశం నిర్వ హించారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ప్రతిపాదనలతో పాటు విభజన చట్టం ప్రకారం ఉన్న పెండింగ్ అంశాలపై చర్చించారు. ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఇటీవల ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు కేంద్రహోంశాఖ పంపించింది. తాజాగా అమరావతి, హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్హై వేకి కేంద్రం పచ్చజెండా ఊపింది. డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని కేంద్ర రోడ్లు, ఉపరితల రవాణాశాఖను ఆదేశించింది. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి అనుమతుల ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

# వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

## బీసీ నేత లింగంగౌడ్



**నేటి ప్రస్థానం:** వేసవి సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహించకుండా చూడాలని కోరుతూ నాంపల్లి లోని జేడీ కార్యాలయంలో విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు చదువుల పట్ల విసుగు చెందే అవకాశం ఉందని, అంతేకాకుండా ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందని, కాబట్టి వేసవి సెలవులను విద్యార్థుల విశ్రాంతి కోసం, సరదా కోసం ఉపయోగపడేలా చూడాలన్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లోని కార్పొరేట్ స్కూల్స్ తొమ్మిదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులను జైళ్లలో బంధించినట్లు బధించి బలవంతంగా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు రవి కిరణ్ ఉన్నారు.




**వా**రు ఎవరో, ఎక్కడుంటారో ఎవరికీ తెలియదు. కానీ, మన వివరాలు సేకరిస్తారు. కాల్ చేసి భయభ్రాంతులకు గురిచేస్తారు. మనకు తెలియకుండానే ఖాతా ఖాళీ చేస్తారు. ఎప్పటికప్పుడు రూటు మార్చుకుంటూ బెదిరిస్తుంటారు. వారి వలలో చిక్కామా? ఇక ఇల్లు, ఒళ్లు గుల్ల చేస్తారు. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే లక్షలు, కోట్ల రూపాయలు కాజేస్తారు. చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా అందరినీ టార్గెట్ చేస్తారు. ఆపై కోలుకోలేని దెబ్బ కొడతారు. కష్టపడి రూపాయి, రూపాయి కూడబెట్టుకున్న సొమ్మునంతా క్షణాల్లో మాయం చేస్తారు. వారు మరెవరో కాదు.. ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న సైబర్ నేరగాళ్లు.

# సైబర్ వల చిక్కితే విలవిల

**అ**తడి పేరు మధు. అప్పటి వరకు తన ఫ్రెండ్‌తో ఫోన్లో మాట్లాడాడు. ఫోన్ పెట్టేసిన కొద్ది సేపటి తర్వాత అదే ఫ్రెండ్ నుంచి తిరిగి ఫోన్ వచ్చింది. అరేయ్.. నీ ఫోన్ బాగానే పని చేస్తుంది కదా అని అడిగాడు. దానికి మధు అవును అని సమాధానం ఇచ్చాడు. మరి ఫోన్ బాగానే పని చేస్తున్నప్పుడు.. ఇంకొకరు ఫోన్ చేసి ఈ స్లిమ్ బ్లాక్ అయిందని.. కొద్దిగా అర్జెంట్‌గా డబ్బులు అవసరం ఉందని.. వెంటనే పంపాలని అడుగుతున్నారని చెప్పాడు. వెంటనే అలర్ట్ అయిన మధు తన ఫోన్ బ్లాక్ కాలేదని.. ఎవరైనా తన పేరు చెప్పి డబ్బులు అడిగితే ఇవ్వొద్దని తన స్టేటస్‌లో పెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

**న**గరానికి చెందిన శ్రీలత గృహిణి. ఆమెకు ఫేస్‌బుక్‌లో మహిళలకు చెందిన నాణ్యమైన వస్త్రాలు తక్కువ ధరకే ఇస్తామన్న పోస్టు నచ్చింది. వెంటనే ఆమె ఆ ప్రకటనదారుడిని సంప్రదించింది. తనకు కావాల్సిన వస్త్రాలను సెలక్ట్ చేసుకొని కొంత నగదును పంపింది. తీరా ఆర్డర్ డెలివరీ కావాల్సిన సమయంలో సైబర్ నేరగాళ్లు ఆ మహిళకు ఫోన్ చేసి డెలివరీ చేయాల్సిన బాయ్‌కు ఆరోగ్యం బాగా లేనందున డెలివరీ ఆలస్యం అవుతుందని చెప్పారు. ఇందుకు గాను మీరు ఇచ్చిన నగదును ఇచ్చేస్తామని నమ్మించారు. మొదటగా అకౌంట్‌ను సరి చూసుకుంటామని చెప్పి ఓ సారి రూ.1, మరోసారి రూ.10 వేశారు. ఆ తర్వాత ఈ రెండు అమౌంట్లు వచ్చాయా లేదా అని నిర్ధారించుకున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఆమె అకౌంట్‌లో ఉండాల్సిన నగదు మాయమైంది.

- ఏటా పెరిగిపోతున్న సైబర్ మోసాలు
- అప్రమత్తమయ్యేలోపే కొత్త ఎత్తులు
- సైబర్ కేటుగాళ్ల వలలో విద్యావంతులు
- భయం, దురాశ కారణంగానే మోసాలు
- హనీట్రాప్ బారినపడుతున్న మరికొందరు
- ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం శూన్యం
- మోసపోయిన తొలి గంటలోనే 1930కి కాల్ చేస్తే సైబర్ క్రిమినల్స్‌కు చెక్
- అప్రమత్తతతోనే నేరాలకు ఫుల్‌స్టాప్



**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** ఇలా ఒక్కరిద్దరు కాదు... సైబర్ నేరగాళ్ల బారినపడి ఎంతోమంది ఇలా మోసపోతున్నారు. ఒకరికి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులంటూ.. మరొకరికి వర్క్ ఫ్రం హోం అంటూ అందినకాడికి దండుకుంటున్నారు. వ్యాపారవేత్తలను సైతం వదలడం లేదు. వారి సర్వర్లలోకి చొరబడి విలువైన డేటాను తస్కరించడంతో పాటు ర్యాన్సమ్‌వేర్ ఎటాక్‌తో కలవరపెడుతున్నారు. సైబర్ నేరాలు ఏటా పెరుగుతున్నాయి తప్పితే తగ్గడం లేదు. కాబట్టి అప్రమత్తత ఒకటే మనల్ని కాపాడగలదు. ఒకప్పుడు మనల్ని బుట్టలో వేసుకుని డబ్బులు కాజేసే సైబర్ కేటుగాళ్లు, ఇప్పుడు భయపెట్టి డబ్బులు కొల్లగొడుతున్నారు. మనల్నే నేరస్తులుగా చిత్రీకరించి భయపెట్టి మరీ డబ్బులు కొల్లగొడుతున్నారు. పాత నేరాలపై అవగాహన పెరిగి అప్రమత్తమయ్యేలోపే కొత్త నేరాలతో వచ్చేస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో పోలీసుల అవతారం ఎత్తి మోసాలకు పాల్పడుతున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి అన్న తేడా లేకుండా మీపై డ్రగ్స్, మనీలాండరింగ్ కేసులు నమోదయ్యాయని భయభ్రాంతులకు గురిచేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. నిజం చెప్పాలంటే భారత చట్టాల్లో డిజిటల్ అరెస్ట్ అనే మాటే లేదు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం పలుమార్లు వెల్లడించారు. మరోవైపు, హనీట్రాప్ పేరిట జరిగే మోసం కుటుంబాల్లోనూ చిచ్చుపెడుతుంది. వలపు వల విసిరే వయ్యారి భామలు వీడియో కాల్స్‌లో నగ్నంగా హొయలు ఒలికిస్తారు. తర్వాత అదే వీడియో చూపించి బ్లాక్‌మెయిల్ చేస్తూ లక్షల రూపాయలు కాజేస్తున్నారు. అలాగే, ఫొటోల మార్ఫింగ్‌తోనూ మానసికంగా, ఆర్థికంగా దెబ్బకొడుతున్నారు.



### మోసం ఇలా..

సామాజిక మాధ్యమాల్లో మునిగిపోయే వారు చివరికి వాటి ద్వారానే మోసపోతున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాముల ద్వారా రకరకాల లింకులు పంపించే మోసగాళ్లు వాటిలో ఏపీకే ఫైల్స్ పంపిస్తూ ఫోన్లను కంట్రోల్‌లోకి తీసుకుంటున్నారు. బ్యాంకుల పేరుతో కేవైసీ చేసుకోవాలని నమ్మిస్తారు. బ్యాంకు ఖాతాల మొదలు అన్నింటినీ హ్యాక్ చేస్తున్నారు. కాబట్టి తెలియని లింకులు క్లిక్ చేయకూడదు. కష్టాల్లో ఉన్నామని, డబ్బులు పంపాలని స్నేహితులకు మెసేజ్ చేస్తారు. వాట్సాప్ డీపీలను మార్ఫింగ్ చేసి డబ్బులు వసూలు చేస్తున్న కేసులు ఇటీవల భారీగా పెరుగుతున్నాయి. టెలికం రెగ్యులేటరీ పేరుతోనూ మోసాలకు పాల్పడుతున్నారు. ఫేక్ కస్టమర్ కేర్, డెబిట్, క్రెడిట్ కార్డు మోసాలు కూడా పెరిగిపోయాయి. కాబట్టి అనుమానాస్పద ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

### ఎక్స్‌టార్షన్.. సెక్స్ టార్షన్

మనుషులను కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేయడం ఎక్స్‌టార్షన్ అయితే, అందమైన యువతులను ఎరవేసి ఆ తర్వాత బెదిరించి డబ్బులు వసూలు చేయడం సెక్స్‌టార్షన్. సామాజిక మాధ్యమాలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, టిండర్ లాంటి యాప్‌ల ద్వారా మనలోని బలహీనతలను తెలుసుకొని సైబర్ నేరగాళ్లు సెక్స్‌టార్షన్ ద్వారా లూటీ చేస్తున్నారు. సంపన్న వర్గాలకు చెందిన వృద్ధులు, యువత వీరి మాయలో పడుతున్నారు. వీరేకాక ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు సైతం సైబర్‌నేరగాళ్ల వలలో చిక్కి విలవిల్లాడుతున్నారు.

### అవగాహనకు మూడు కోతులు..

సైబర్ నేరాలపై అవగాహన కోసం పోలీసులు వినూత్న ప్రచారాన్ని ఎంచుకున్నారు. తాజాగా డిజిటల్ ఏజ్ మంకీస్‌ను తెరపైకి తెచ్చారు. చెడు చూడొద్దు.. చెడు మాట్లాడొద్దు.. చెడు వినొద్దు అని అనాటి కోతులు చెబితే.. ఈ డిజిటల్ కోతులు.. ఎవరికి ఓటీపీలు చెప్పొద్దు.. తెలియని లింక్‌లు క్లిక్ చేయవద్దు.. అపరిచితుల ఫోన్ కాల్స్ వినొద్దు అని రూపొందించారు.

### అప్రమత్తంగా ఉండాలి..

సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. నగదు రెట్టింపు అన్నా, వర్క్ ఫ్రం హెూం అన్నా వెంటనే అనుమానించాలి. వారు చెప్పే మాటలు విని వారి మాయలో పడ్డారో అంతే సంగతులు. ఖాతా గుల్ల కావాల్సిందే. సైబర్ నేరం జరిగిన వెంటనే అవమానం జరిగిందని బాధపడకుండా వెంటనే గోల్డెన్ అవర్‌లో తక్షణమే 1930కు ఫోన్ చేయాలి. సంబంధిత బ్యాంకు అధికారులను సంప్రదించి వెంటనే సైబర్ నేరగాళ్ల ఖాతాలను ఫ్రీజ్ చేయించాలి.








డాక్టర్ బూర నర్సయ్య గౌడ్
భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు
బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు, పీఎంవీకేవై తెలంగాణ రాష్ట్ర కన్వీనర్

ఇస్లాంలో మతపరమైన, దాతృత్వ కార్యక్రమాలకు అవసరమైన సంపదను వక్ఫ్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఉపయోగిస్తారు. వక్ఫ్ దానం చేసిన వారిని వాకీఫ్ ( దానకర్తలు ) అని, ఈ సంపదను పర్యవేక్షించడానికి నియమించబడిన వ్యక్తిని ముతవల్లి అంటారు. ఇస్లాంలో అతి ముఖ్యమైన పిల్లర్లలో జకాత్ ( ధార్మిక దక్షిణ ) వల్ల వక్ఫ్ సంపద ముస్లిం మానవ, మాధవ సేవకు ఉపయోగిస్తారు. వక్ఫ్ బ్రిటిష్ కాలం నుంచి అనేక రూపాంతరాలు చెందింది. ముసల్మాన్ వక్ఫ్ వాలిడేటింగ్ యాక్ట్, 1913, ముసల్మాన్ వక్ఫ్ యాక్ట్ 1923, వక్ఫ్ యాక్ట్ 1954, సవరణలు 1959, 64, 69, 1984లో చేయడం జరిగింది. వక్ఫ్ 1954 యాక్టును మార్చి 1995లో కొత్త యాక్ట్ చేయడం చేశారు. అలానే 2013 లో సవరణలు ద్వారా వక్ఫ్‌కు భారత దేశంలోని ఏ సంస్థకు లేని అధికారం ఇచ్చి అవినీతికి రాచమార్గం వేసింది కాంగ్రెస్ ప్రభుత్వం.

# వక్ఫ్ చట్టంతో ముస్లిం సంక్షేమానికి సోపానం





## వక్ఫ్ బోర్డులో ఉన్న ప్రధాన సమస్యలు

1) అధికారం కొండంత, జవాబుదారీ శూన్యం : ముత్తవల్లి సర్వ అధికారాలు. అత్యంత అవినీతిమైన వ్యవస్థ. జవాబుదారీ తనం శూన్యం.
2) కబ్జాలు, కోర్ట్ కేసులు, బందువులకు అప్పగింత
3) కోట్ల ఆస్తులు,పైసల్లో లీజు లేదా రెంటు. 30ఏండ్ల లీజులు
4) వక్ఫ్ బోర్డు సభ్యులలో అందరు ఒక సిండికేటే : మొత్తం ఆస్తులు ముస్లింలలోని లీడర్లు, నవాబులు, ఉన్నత వర్గాల హస్తగతం. అత్యధిక ఆస్తులు వారి హాస్పిటల్స్ , మెడికల్ కాలేజీలు , కమర్షియల్ బిల్డిం గ్స్ , అపార్ట్‌మెంట్లు ఇలా "అల్లా ఆస్తులు , అందరూ హాంఫట్ " చేశారు. రూ. 8,70,000 ఆస్తుల వివరాలకు బదులు కేవలం రూ. 3,30,000 ఉన్నాయి. మిగతా వాటికి లెక్కలు లేవు.
5) 2013లో కాంగ్రెస్ పార్టీ గద్దె దిగేటప్పుడు సెక్షన్ 40 తెచ్చింది. ఇది ఒక రాజ్యాంగ ఉల్లంఘన. సెక్షన్ 40 ప్రకారం ముతావలి, ఎలాంటి ప్రామాణికం లేకుండా భారతదేశ మొత్తాన్ని కూడా వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించే అవకాశం కల్పించారు. ఇంకా ఘోరమైన విషయం ఏమిటంటే , భారతదేశంలోని ఏ కోర్టుకు కూడా వక్ఫ్ ట్రిబ్యునల్ లేదా ముతావలి చర్యలను సమీక్షించే అవకాశం లేకుండా చేశారు.
6) వక్ఫ్ బోర్డులో ముస్లిం వెనకపడ్డ వర్గాలకు, స్త్రీలకు రిజర్వేషన్ లేనందున కేవలం ముస్లింలోని ఉన్నత వర్గాలకే ఆడింది ఆట పాడింది పాట అయింది.
7) వక్ఫ్‌పై దేశంలో 40,000 కేసులు ఉంటే, అందులో 10,000 ముస్లింల వక్ఫ్‌పై వేసిన కేసులే.

## వక్ఫ్ ఆస్తులు.. వివరాలు?

ప్రపంచంలో వక్ఫ్‌కు అత్యంత ఆస్తులు ఉన్నది భారతదేశంలోనే. 2024 నాటికీ మొత్తం ఆస్తులు 9.4 లక్షల ఎకరాలు. వాటివిలువ దాదాపు 1.2 లక్షల కోట్లు (మార్కెట్ విలువ ఎక్కువే ) ఉన్నది. అందులో 5,32,819 ఎకరాలకు లెక్కలు లేవు లేదా కబ్జాల్లో ఉన్నాయి. ఇక సచార్ కమిటీ రిపోర్ట్ ప్రకారం వక్ఫ్ ఆస్తుల నుంచి ఏడాదికి కనీసం రూ.12,000 కోట్ల ఆదాయం రావాలి. కానీ, 2019లో రూ.163 కోట్లు వస్తే, 2024 మొత్తం దేశంలో కేవలం రూ.1.6 కోట్ల ఆదాయం రావడం ఒక హాస్యాస్పద సన్నివేశం. భారత దేశంలో రక్షణ రంగం, రైల్వేస్ తర్వాత అత్యధిక ఆస్తులు ఉన్నది ఇస్లాం మతపరమైన వక్ఫ్ సంపద. 'అంగట్లో అన్నీ ఉన్నాఅల్లుడి నోట్లో శని' అన్నట్లు, వక్ఫ్ పేద ముస్లింలకు ఒక వరం కావాలి కానీ, ఒక శాపం అయింది.





## తెలంగాణలో వక్ఫ్ ఆస్తులు, అవస్థలు

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం ఆస్తులు 77,538 ఎకరాలు, 33,929 ఆస్తులు, అందులో 57,423 ( 75%) ఎకరాలు కబ్జా, 3500 కేసులు , దాదాపు ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం 4 లక్షల కోట్లు ఉన్న ఈ ఆస్తుల వల్ల వచ్చే ఆదాయం సున్నా. ఉదారణకు చార్మినార్ దగ్గర ఉన్న మదీనా కాంప్లెక్స్ అనే కమర్షియల్ కాంప్లెక్స్ వక్ఫ్ ఆస్తి, కోట్ల ఆదాయం వస్తున్నా వక్ఫ్ సంస్థకు ఇచ్చే రెంట్ ఏడాదికి రూ.10,000 కూడా లేదు. తెలంగాణాలో కబ్జా అయిన భూముల్లో అత్యధికంగా బడా నేతల, బడా వ్యాపారుల ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, ప్రైవేట్ హాస్పిటళ్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఫంక్షన్ హాళ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు , కంపెనీలు ఉండటం విశేషం. కొన్ని నామమాత్రం లీజు, అత్యధికంగా కబ్జా. అందుకే వీరి నుండి వ్యతిరేకత.

## వక్ఫ్ బోర్డు సెక్షన్ 40 సృష్టిస్తున్న అరాచకం

1) అధికారం కొండంత, జవాబుదారీతనం శూన్యం. భారతదేశం మొత్తంలో కోర్టులకు పర్యవేక్షణకు అవకాశం లేని ఏకైక చట్టం అది.
3) తమిళ నాడు లోని ఒక గ్రామం ( తిరుచునాతీరు ) మెంత్తం వక్ఫ్ ఆస్తి అని ప్రకటించారు.
4) సూరత్‌లోని మునిసిపల్ కార్పొరేషన్ బిల్డింగ్, ఆవరణ మొత్తం తమదేనని వక్ఫ్ ప్రకటించింది.
5) దేవ భూమి ద్వారకలో, బెట్ ద్వారకలో రెండు ద్వీపాలు తమవేనని వక్ఫ్ ప్రకటించింది.
6) సూరత్‌లోని శివశక్తి సొసైటీలో రెండు ప్లాట్లు వక్ఫ్ అని ప్రకటించి అక్కడ ఒక మసీదు నిర్మించారు.
7) తిరుచందూరు దేవాలయం 600 ఎకరాలు, బెంగళూరులో 600 ఎకరాలు, విజయపురి జిల్లా కర్ణాటకలో 1500 ఎకరాలు, కర్ణాటక దత్తపీట్ మందిర్ , కర్ణాటక పాలీపుర టెంపుల్ 600 ఎకరాలు , కేరళలోని క్రిస్టియన్ మిషనరీస్ ఆస్తులు, తెలంగాణలోని 4,000 ఎకరాల ప్రభుత్వ , ప్రైవేట్ భూమి , అస్సాం మొరిగోవాన్ లో 400 ఎకరాలు, ప్రయాగరాజ్ లోని చంద్రశేఖర్ ఆజాద్ పార్క్, మహారాష్ట్రలోని మహాదేవ్ మందిర్, ఇలా 2013 లో 9.4 లక్షల ఎకరాలు ఉన్న వక్ఫ్ ఆస్తులను సెక్షన్ 40 అడ్డంపెట్టుకొని వివిధ రాష్ట్రాలలో 36 లక్షల ఎకరాలు ప్రభుత్వ, ప్రైవేట్ భూమి వక్ఫ్ ఆస్తులు అని ప్రకటించి ఒక మహా లిటిగేషన్ అవతారమెత్తింది.

## సచార్ కమిటీ.. వాటి సిఫార్సులు

2005 అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ సచార్ కమిటీ ముస్లింల ఆర్థిక, సామజిక, విద్య ఎదుగుదలకు అధ్యయనానికి ఏర్పాటు చేసిన కమిటీ .

1) వక్ఫ్ ఆస్తుల నుంచి ఏడాదికి కనీసం 12000 కోట్ల ఆదాయం రావాలి. కానీ కేవలం 163 కోట్లు మాత్రమే వస్తోంది. (2024లో కేవలం 1.6 కోట్లు వచ్చింది)
2) ముతావలి పనితీరు పారదర్శకంగా ఉండేటట్లు చూడాలి.
3) రికార్డులు మొత్తం పారదర్శకంగా ఉండాలి.
4) వక్ఫ్ బోర్డులో ఏ మతం వారు అయినా టెక్నికల్ నిపుణలను నియమించాలి.
5) బోర్డులో మహిళలు, వెనకబడిన వర్గాలు, ముస్లింలలో ఉన్న ఇతర తెగలకు స్థానం కల్పించాలి
6) జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారులను కౌన్సిల్ , బోర్డులలో స్థానం కల్పించాలి.
7) వక్ఫ్ బోర్డును ఫైనాన్సియల్ అడిట్ పరిధిలోకి తేవాలి.

## ఇతర ఇస్లామిక్ దేశాలలో వక్ఫ్ ఎలా నిర్వహించబడుతుంది?

సౌదీ అరేబియా, టర్కీ, ఇరాక్, ఇరాన్, ఒమన్, మలేసియా, ఇండోనేషియా లాంటి అనేక దేశాలలో భారత్‌లో కంటే వక్ఫ్ ఆస్తులు చాలా తక్కువ. అలానే అత్యధిక దేశాలలో ప్రభుత్వ అధికార యంత్రాంగ పరిధిలోనే వక్ఫ్ నడుస్తున్నది. ప్రత్యేక ప్రతిపత్తి అంటూ ఎక్కడా లేదు. యూనిఫైడ్ వక్ఫ్ నిర్వహణ, సాధికారత, సమర్థత, అభివృద్ధి చట్టం(2025) ద్వారా ముస్లిం సమాజానికి కలిగే లాభాలు

**పారదర్శకత పెంపు:** వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, డిజిటల్ రికార్డింగ్.

**ఆర్థిక సద్వినియోగం:** వక్ఫ్ ఆస్తుల ఆదాయాన్ని సామాజిక, విద్యా అభివృద్ధికి వినియోగించడం.

**అక్రమ ఆక్రమణల నివారణ:** ఆక్రమణలపై చర్యలు, చట్టపర రక్షణ.

**పరిపాలనా సామర్థ్యం:** పనితీరులో సమర్థత, సమన్వయం.

**మహిళలకు సమాన హక్కులు:** వక్ఫ్ నిర్వహణలో మహిళా ప్రాతినిధ్యం. ముస్లింలలోని వెనుకపడ్డ వర్గాలకు, అల్పసంఖ్యాక వర్గాలు షియా,అఘకాని,బోరా,ఇస్మాయిలి వర్గాలకు ప్రాతినిధ్యం.

**తిరస్కరణ, ఆడిట్ వ్యవస్థ:** వక్ఫ్ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఫిర్యాదు అవకాశం. ఆడిట్ నివేదికలు అందుబాటులో ఉంచడం.

**ముగింపు:** 2025 వక్ఫ్ చట్ట సవరణలు ముస్లిం సమాజానికి ఆర్థిక, సామాజిక, విద్యాపరంగా మెరుగైన అవకాశాలు కల్పిస్తాయి. పారదర్శకత పెంపు, అక్రమ ఆక్రమణల నివారణ, మహిళలకు సమాన హక్కుల కల్పన వంటి మార్పులు సమాజ అభివృద్ధి దిశగా మంచి అడుగులు. ముగించే ముందు, ఇప్పటి వరకు వక్ఫ్ చట్టం కేవలం నాయకులకు, ధనిక వర్గాలకు, ఆక్రమణ దారులకు ఒక అడ్డాగా మారింది. పేదవర్గాలకు చేరవలసిన ఫలాలు ధనిక వర్గాలు కొల్లగొట్టాయి. మోడీ అల్లాహ్ ఆస్తులు పేద వర్గాలు, మహిళలకు అందాలనే ప్రయత్నమే ఈ సవరణలు. ఇందు వలన హిందూ సమాజానికి కానీ, ఇతర మతస్థులకు కానీ వచ్చే లాభం ఏమీ లేదు. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్', 'సబ్ కా విశ్వాస్.. సబ్ కా ప్రయాస్' అనే స్ఫూర్తే ఈ సవరణల ప్రధాన ఉద్దేశం.

## రైతు సంక్షేమమే ధ్యేయం



నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**నేటి ప్రస్థానం, యాదాద్రి భువనగిరి జిల్లా:** రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం రామన్నపేట మండలం దుబ్బాక, మునిపంపుల, పల్లివాడ గ్రామాల్లో ఎఫ్‌పీవో రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రైతు పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేదన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు రుణమాఫీ చేసిందన్నారు. రైతుల దళారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలన్నారు.

## గౌడ కులస్తులకు కాటమయ్య కిట్లు



**నేటి ప్రస్థానం:** కాటమయ్య కిట్లపై శిక్షణను పూర్తిచేసుకుని అర్హత సాధించిన గౌడ కులస్తులు 70 మందికి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చెన్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. చెన్నూర్ మండలం ఒత్కులపల్లి గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర




**నేటి ప్రస్థానం:** ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు చిలికానగర్‌లో 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర'ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిలికానగర్ డివిజన్ కోఆర్డినేటర్ హెచ్ఆర్ మోహన్, డివిజన్ అధ్యక్షుడు రాజేష్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ పాదయాత్ర ప్రారంభానికి ముందు బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. వారి ఆశయాలను స్మరించుకుంటూ, రాజ్యాంగ పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించే గొప్ప పత్రిక. ఇది మన దేశాన్ని ప్రజాస్వామ్య మార్గంలో ముందుకు నడిపే దీపస్తంభం. అలాంటి రాజ్యాంగాన్ని రక్షించడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత' అన్నారు.

## బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘటన

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో షకీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివిధ కేసుల్లో షకీల్ అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది. కొంతకాలంగా ఆయన దుబాయ్‌లోనే ఉంటున్నారు. అయితే షకీల్ తల్లి అనారోగ్యంతో కన్నుమూశారు. అంత్యక్రియల కోసం షకీల్ హైదరాబాద్‌కు వచ్చారు. ఆయనను శంషాబాద్ విమానాశ్రయంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే తల్లి అంత్యక్రియలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే పోలీసులకు కోరారు. దీనికి పోలీసులు అంగీకరించారు. షకీల్ తల్లి అంత్యక్రియలు ముగిసిన వెంటనే ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకోనున్నారు. ఇప్పటికే పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో షకీల్‌ను పోలీసులు అరెస్ట్ చేయనున్నారు. ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులను మేనేజ్ చేసి తన కుమారుడిని కేసు నుంచి తప్పించే ప్రయత్నం చేశారంటూ షకీల్‌పై గతంలోనే పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో అతనిపై కూడా కేసు నమోదు అయ్యింది. కేసు నమోదు విషయం తెలిసిన షకీల్ ఇండియాకు రాకుండా దుబాయ్‌లోనే ఉండిపోయారు. ఇప్పుడు ఇండియాకు వచ్చాక ఎయిర్‌పోర్టు అధికారులు అదుపులోకి తీసుకుని హైదరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని షకీల్‌ను అరెస్ట్ చేశారు. అయితే తల్లి అంత్యక్రియల కోసం మాజీ ఎమ్మెల్యేకు అనుమతించారు పోలీసులు. సాయంత్రం షకీల్‌ను అదుపులోకి తీసుకుని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించే అవకాశం ఉంది.



# భవిష్యత్‌లో బీఆర్ఎస్‌దే విజయం

- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
- నాంపల్లి మండలంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం
- బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

**నేటి ప్రస్థానం, యాదాద్రి భువనగిరి:** మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై సమరశంఖం పూరించడంతో పాటు బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఏప్రిల్ 27న వరంగల్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారంహా మునుగోడు నియోజకవర్గంలోని నాంపల్లి మండల కేంద్రంలో భారత రాష్ట్ర సమితి నాంపల్లి మండల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మునుగోడు మాజీ శాసనసభ్యుడు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 సంవత్సరాలు కావస్తున్న శుభ సందర్భంలో పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించాలని పార్టీ అధినాయకత్వం నిర్ణయించిందన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 15 నెలల నుంచి ఏ సంక్షేమ కార్యక్రమం పూర్తిగా అమలు చేయకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఆ పార్టీపై సింహ గర్జన పూరించేలా ఈ భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నాంపల్లి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి స్వచ్ఛందంగా కార్యకర్తలు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని.. రానున్న రోజుల్లో అధికారం మనదే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అన్ని గ్రామాల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జీతం కోసం ప్రైవేటు స్కూల్ టీచర్ ధర్నా




**నేటి ప్రస్థానం:** తాను చదువు చెప్పే పాఠశాల ముందు పిల్లలు చూస్తుండగా ఓ ఉపాధ్యాయుడు జీతం కోసం బైఠాయించడం పలువురికి కన్నీరు తెప్పించింది. పాఠశాలలో గత రెండు నెలలుగా జీతం అందకపోవడంతో ప్రైవేట్ టీచర్ ధర్నా చేసిన సంఘటన గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలుమల్లకు చెందిన నల్ల ఆదిరెడ్డి జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్‌కే స్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా చేరారు. యాజమాన్యం అడపా దడపా జీతం ఇస్తుండటంతో కుటుంబం గడవడం ఇబ్బందిగా మారింది. దీంతో మార్చి 24 నుంచి స్కూలుకు వెళ్లడం మానేసి జీవనోపాధి కోసం కూలిపనికి వెళ్తున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలకు సంబంధించి రూ. 18 వేల జీతం రావాల్సి ఉండటంతో ఆదిరెడ్డి గురువారం పాఠశాలకు వెళ్లారు. మేనేజ్‌మెంట్ అందుబాటులో లేకపోవడంతో పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. పూట గడవని పరిస్థితి ఉందని ఎంత బతిమలాడినా ఈనెల 17న మొత్తం జీతం ఇస్తానని మేనేజ్‌మెంట్ చెప్పిందని ఆదిరెడ్డి తెలిపారు. అధికారులు పట్టించుకొని జీతం ఇప్పించాలని కోరారు.

# పరిధి దాటి వైద్యం చేయొద్దు

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ధన్వంతరి గ్రామీణ వైద్యుల సమావేశానికి
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే

**నేటి ప్రస్థానం, షాద్‌నగర్:** ఆర్ఎంపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిధి దాటి వైద్యం చేయవద్దని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ధన్వంతరి గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సంఘ భవనంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆర్ఎంపీలు ఎట్టి పరిస్థితుల్లో పరిధి దాటి వైద్యం చేయవద్దని కోరారు. గ్రామాల్లో అందుబాటులో ఉండి అత్యవసర సమయాల్లో వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలపై గ్రామాల్లో మంచి నమ్మకం ఉందని, ఆ నమ్మకాన్ని పరిధి దాటి వైద్యం చేసి పోగొట్టుకోవద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగిని ప్రభుత్వ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. అంతేకానీ డబ్బులకు ఆశపడి రిస్క్‌తో కూడిన వైద్యం మాత్రం అందించవద్దని తెలిపారు. గతంలో జరిగిన ఉదంతాలు పునరావృతం కాకుండా జాగ్రత పడాలని కోరారు. అతి త్వరలో ఇండియన్ మెడికల్ కౌన్సిల్ వైద్యులతో ధన్వంతరి గ్రామీణ వైద్యుల బృందంతో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తానని పేర్కొన్నారు. ధన్వంతరి గ్రామీణ వైద్యులు ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం నడుచుకోవాలని కోరారు అలాగే ప్రభుత్వ అధికారులు, డీఎంహెచ్‌వోల ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ధన్వంతరి గ్రామీణ వైద్యుల సంఘ నాయకులు, గ్రామీణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.





## 'సేవ్ హెచ్‌సీయూ'లో పాశం యాదగిరి, తెలంగాణ విఠల్

**నేటి ప్రస్థానం:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా చేసిన అభివృద్ధి ఏమీ లేదని, అభివృద్ధి పేరుతో ప్రజా సంపద విలువైన భూములను అమ్ముకోవటానికి ప్రయత్నం చేయడం తప్ప మీరు ఏం చేశారని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, తెలంగాణ విఠల్ ప్రభుత్వాన్నిప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విధమైన ధోరణికి పోతుందనే ఆనాడు తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగా అయితే పనిచేశానో, ఆ విధంగానే ఈ నియంత పాలన పోవాలని పనిచేస్తే ఈనాడు మీరు వచ్చి ప్రభుత్వంఖజానాని బడా కంపెనీలకి ధారాదత్తం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి విధానాలు మానుకోవాలి డిమాండ్ చేశారు.